www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 18 డిసెంబరు 2022 | 5 | ఏలూరు

సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

జంగారెడ్డిగూడెం: భీమవరంలో వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జి.లక్ష్మణ్ అధ్యక్షత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సుభాషిని మాట్లాడుతూ వచ్చేనెల రెండో తేదీన చలో భీమవరానికి కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో గడిచిన మూడు సంవత్సరాల పోరాటాలను వివరిస్తూ రానున్న మూడు సంవత్సరాల్లో చేపట్టబోయే కార్మిక పోరాటాలపై ప్రణాళిక రూపొందించుకుంటామని తెలిపారు. అలాగే జనవరి రెండో తేదీన భీమవరంలో భారీ ప్రదర్శన ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వర్కర్లు ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభ జయప్రదానికి కార్మికులు, ఉద్యోగులు వ్యాపారస్తులు, ఫ్యాక్టరీల ప్రజల ఉద్యమ నిధికి విరాళాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.బాలరాజు, పెంటయ్య, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

కమిషనర్ అవినీతి కల్లోలం..!

- గతకొంతకాలంగా ఏలూరు కార్పొరేషన్‌పై అవినీతి ఆరోపణలు
- నియంతలా కమిషనర్ షాహిద్
- శాఖలవారీగా నెలనెలా మామూళ్ల వసూలుపై సర్వత్రా చర్చ
- ఉద్యోగులపై బూతు పురాణం..
- ఆందోళనకు దిగిన పరిస్థితి
- ఎట్టకేలకు స్పందించిన ఉన్నతాధికారులు
- దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్ ఇంటికి
- మరోవారంలో కొత్తకమిషనర్ రాక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ షాహిద్ సృష్టించిన అవినీతి కల్లోలంపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించారు. కమిషనర్‌ను దీర్ఘకాలిక సెలవుపై ఇంటికి సాగనంపారు. ప్రజాప్రతినిధులు ఉదాసీనత కారణంగానే ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఈ విధంగా రెచ్చిపోయారన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షాహిద్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు సైతం మీడియా సమావేశాలు పెట్టి కమిషనర్‌పై అవినీతి ఆరోపణల చిట్టా వెల్లడించారు. అయినప్పటికీ చర్యలు లేకపోవడంతో కమిషనర్ మరింత రెచ్చిపోయినట్లు చెబుతున్నారు. ఉద్యోగులను బండబూతులు తిడుతుండటంతో ఈనెల 16వ తేదీన సిబ్బంది విధులను బహిష్కరించి కమిషనర్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఏలూరు కమిషనర్‌గా చేరినప్పటి నుంచి షాహిద్ ఒక నియంతలా వ్యవహరించినట్లు తీవ్ర చర్చ సాగుతోంది. ఆయన చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరించేవారని చెబుతున్నారు. శాఖల వారీగా పెద్దఎత్తున అవినీతికి తెరలేపడం సైతం చర్చనీయాంశంగా మారింది. టౌన్ ప్లానింగ్ శాఖ నుంచి ప్రతినెలా రూ.లక్ష ఇవ్వాలని, శానిటేషన్ శాఖనుంచి రూ.లక్షా 40వేలు ఇవ్వాలని ఈ విధంగా కార్పొరేషన్‌లో పనిచేసే ప్రతీశాఖ నుంచి పెద్దఎత్తున మామూళ్లు ఇవ్వాలని టార్గెట్‌లు సైతం పెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంట్రాక్టర్లు గతంలో వారు చేసే పనులకు సంబంధించి ఒకశాతం కమిషన్ ఇస్తే ఇప్పుడు దాన్ని నాలుగు శాతానికి పెంపు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు నిర్మించే బిల్డర్లకు పర్మిషన్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. బిల్డర్స్ నుంచి మామూళ్లు పెద్దఎత్తున డిమాండ్ చేసేవారన్న ఆరోపణలున్నాయి. ఆదినుంచి కమిషనర్‌పై ఆరోపణలు వస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు పెద్దగా స్పందించలేదు. దీంతో కమిషనర్ మరింత రెచ్చిపోయినట్లు చెబుతున్నారు. ఉద్యోగులు సైతం కమిషనర్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగడంతో ఉన్నతాధికారుల్లో చలనం వచ్చింది. సస్పెండ్ చేస్తే అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్న కారణంతో దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్‌ను సాగనంపినట్లు సమాచారం. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా జెసి అరుణ్‌బాబుకు బాధ్యతలు అప్పగించినప్పటికీ వారం, పదిరోజుల్లో కొత్తకమిషనర్ నియామకం జరగనున్నట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా గతంలో ఎన్నడూలేని విధంగా ఏలూరు కార్పొరేషన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం స్థానిక ప్రజానీకంలో చర్చనీయాంశంగా మారింది.

ప్రజాప్రతినిధుల అండతోనేనా?

ఏలూరు కమిషనర్లుగా ఎంతోమంది పనిచేశారు. కానీ ఏ ఒక్క కమిషనర్ ఇంతటి దారుణమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదు. షాహిద్‌పై ఆది నుంచి అవినీతి ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కమిషనర్‌గా ఉన్న షాహిద్ ఇష్టానుసారంగా రెచ్చిపోవడానికి ప్రధానకారణంగా ప్రజాప్రతినిధుల అండ ఉన్నట్లు చర్చ నడుస్తోంది. స్థానిక ఎంఎల్ఎ అండతోనే కమిషనర్ నియంతలా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిలోనే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్పొరేషన్‌లో అవినీతికి అడ్డుకట్టవేయాలని జనం కోరుతున్నారు.

తడిసి మొలకలొచ్చిన ధాన్యం చూపుతున్న రైతులు

ధాన్యం కొనండి మహాప్రభో..!

అర్ధవరం కౌలు రైతుల ఆవేదన

ప్రజాశక్తి - గణపవరం

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు, వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండం లేదు. మండలంలోని అర్ధవరం గ్రామంలో కౌలు రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని, ధన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తేమ శాతం 17 ఉంటే కొనుగోలు చేస్తామని చెప్పి, ఆ శాతం ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో రాత్రింబవళ్లు కల్లాల వద్ద ధాన్యం వద్దే కాలం గడుపుతున్నామని, ప్రతిరోజు ధాన్యం ఆరబెట్టడానికి రూ.500 ఖర్చవుతుందనికౌలు రైతులు జాలీ జాన్, కప్పల కొండయ్య, కస్తూరి ఏసుదాసు, బళ్లా కిరణ్ అన్నారు. పండిన పంట మొలకలు వస్తే ధాన్యం కొనుగోలు చేయడానికి అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వేలాది రూపాయలు వరి సాగుకు ఖర్చు పెట్టామని, దీనికితోడు వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాలంటే అదనంగా ఖర్చవుతుందని, అర్ధవరం గ్రామంలో 1300 ఎకరాలు వరిసాగు చేస్తున్నారని, పండిన పంట ప్రభుత్వాధికారులు 50 శాతం కూడా కొనుగోలు చేయలేదని వారు అన్నారు. కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదని అన్నారు ఇప్పటికైనా అధికారులు తమ వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మొలకలు వస్తే ధాన్యం పనికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ఆర్‌బికెల్లో ముమ్మరంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతున్నాయని మండల వ్యవసాయాధికారి అధికారి బొర్రా వేణుమాదవ్ అన్నారు. ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో 15వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ఇప్పటి వరకు సూమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్లు చెప్పారు. సూమారు మూడు వేల ఎకరాల్లో పంటను రైతులు కుప్పలుగా వేశారని, వేయి ఎకరాల్లో కోత మిషన్లతో మాసూలు పూర్తిచేశారని తెలిపారు. మరో 700 ఎకరాల్లో పంట కోసి పనలపై ఉన్నట్లు తెలిపారు. తుపాన్ సంబంధించి రైతాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తునానమన్నారు.

ప్రోటాకాల్‌ను విస్మరిస్తున్న పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామపంచాయతీ సాధారణ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ పాటించకుండా కార్యదర్శులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉనికిలి ఎంపిటిసి సభ్యులు, వైస్‌ఎపిపి ఆదివిష్ణు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధుల పట్ల కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

స్థానిక సమస్యలపై దృష్టి : ఎంఎల్‌ఎ ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా కౌన్సిలర్లకు సూచించారు. శనివారం స్థానిక 4, 5 సచివాలయాల పరిధి బాట గంగానమ్మ గుడి లే అవుట్ కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్నమట్ల ఎలిజా మాట్లాడారు.

సమస్యల వలయంలో గిరిజన పాఠశాలలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన ఆశ్రమ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోకి విద్యార్థి, ప్రజాసంఘాలను, సామాజిక కార్యకర్తలను, పత్రికా విలేకరులను ప్రవేశించొద్దని చెప్పడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు.

పాఠశాలలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

పర్వతాపురం దళితవాడ ఎంపిపి పాఠశాలను ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టీని, మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వర్గీకరణపై నాన్చుడు ధోరణి సరికాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని నమ్మించి ద్రోహం చేసిన బిజెపితో తాడో పేడో తెల్చుకోవడానికి యావత్తు మాదిగ జాతి సిద్ధంగా ఉండాలని ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాముడూరి ఏలియా అన్నారు. ఎంఆర్‌పిఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లోని ఎంఆర్‌పిఎస్ నాయకులతో శనివారం నీలాద్రిపురంలో ఎస్‌సి కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ఈనెల 28న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

19న ఏలూరుకు గవర్నర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో ఈనెల 19వ తేదీన జరిగే 16వ బ్యాచ్ దంత వైద్య విద్య(బిడిఎస్) పూర్తి చేసిన వంద మంది విద్యార్థులకు ఏలూరు ఆర్‌సిఎం పీఠాధిపతులు బిషప్ పొలిమేర జయరావు నేతృత్వంలో గవర్నర్ విశ్వభూషణ్‌హరిచందన్ ద్వారా దంత వైద్య పట్టా ప్రదానోత్సవం జరుగుతుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ శనివారం మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికార్ జనరల్ (డిప్యూటీ బిషప్) ఫాదర్ పి.బాల మాట్లాడుతూ దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ స్థాపించి 20 ఏళ్లయిందని తెలిపారు 2002లో మొదటి అకాడమిక్ ఏడాది అప్పటి బిషప్ రెవరెండ్ మోస్ట్ జాన్ ములగాడ కలల సాకారంతో ప్రారంభమైందని వివరించారు. దుగ్గిరాల డెంటల్ కళాశాల నేడు ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు మణిహారంగా నిలిచిందని చెప్పారు. ఈ కాలేజీలో ప్రతిఏటా వంద మంది దంతవైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఫాదర్ బాల చెప్పారు. ఇప్పటి వరకూ దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజి 1600 మంది దంత వైద్యులను సమాజానికి అందించిందని తెలిపారు. ఇక్కడ బిడిఎస్ చదివిన వారు విదేశాలలో మంచి దంత వైద్యులుగా స్థిరపడ్డారని పేర్కొన్నారు. గతేడాది నుండి డెంటల్ కాలేజి కరస్పాండెంట్‌గా ఫాదర్ జి.మోజెస్ విశిష్ట సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.స్లీవరాజు, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపల్‌తో పాటు కళాశాల పిడిఎన్ నల్లయ్య పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసిపి

టిడిపి ఆధ్వర్యాన దళిత సమరభేరి యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి ప్రభుత్వం హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తుందని టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్.రాజు ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో దళిత సమరభేరి ర్యాలీని శనివారం ఏలూరు నగరంలో నిర్వహించారు. తొలుత స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో వసంత మహల్ సెంటర్ వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో అక్కడ నుంచి కార్ల ద్వారా పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను హత్య చేసి జైలుకెళ్లి వస్తే అతనికి వైసిపి స్వాగతం పలకడం గర్హనీయమన్నారు. అనంతబాబును పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తోట సీతారామలక్ష్మి, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, ఎస్సీ సెల్ నాయకులు దాసరి ఆంజనేయులు, బాలాజీ, తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

గోకుల పారిజాత గిరికి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి ఈశ్వరస్వామి ఆలయానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం మరో సీసీ రోడ్డు నిర్మాణాన్ని దాతల సాయంతో నిర్మిస్తున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు తెలిపారు. శనివారం దాతలు పి.భూషణ్, కిలారు సతీష్, వేమూరి రాంబాబు ఆర్థిక సహకారం తో నిర్మిస్తున్న రొడ్డు పనులను అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మెనూ అమలు తప్పనిసరి : ఆర్‌డిఒ కిషోర్

ప్రజాశక్తి - దెందులూరు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల్ కిషోర్ అంగన్‌శాడీ సిబ్బందిన ఆదేశించారు. కొవ్వాలిలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. గర్భిణులతో, చిన్నారులతో మాట్లాడారు. రికార్డులు తనిఖీ చేశారు.

పెన్షన్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - భీమడోలు

రిటైర్డ్ ఉద్యోగులకు 2004 నుంచి నిలిపివేసిన పెన్షన్‌ను పునరుద్ధరించాలని భీమడోలు పూర్వపు సమితి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భీమడోలులోని పెన్షనర్స్ భవనంలో శనివారం జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ యూనియన్ అధ్యక్షులు రామ్మోహనరావు, గౌరవ అధ్యక్షులు పంచకర్ల సత్యనారాయణ, పాలేటి బ్రహ్మారావు సభ్యులు పాల్గొన్నారు.

మత్తు వైద్యుణ్ని నియమించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఏరియా ఆసుపత్రిలో మత్తు వైద్యుని (ఎనస్తీషియా) కొరతను పరిష్కరించాలని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నతాధికారులను కోరారు. శనివారం ఏరియా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు రాపోలు బావనరుషి, మానేపల్లి స్వప్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సల్మా, డాక్టర్ వంశీకిరణ్, డాక్టర్ శ్రీనివాస్, హెడ్ నర్స్ కృపామణి పాల్గొన్నారు.

చాట్రాయిలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయిలో శనివారం టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంపసాటి చెన్నారావు, వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కోటా జోషి, పలగాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలులో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రైతులు శనివారం ఆందోళనకు దిగారు. రైతులకు అవసరమై గోనె సంచులు, లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని యండపల్లి రైతులు ఆందోళనకు దిగారు. మాసూలు పూర్తిచేసి ధాన్యం కల్లాల్లో 20 రోజులుగా ఉంటుందని, గోనె సంచుల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి పాడైందని, మళ్లీ వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, మరోసారి వర్షాలు పడితే ధాన్యం పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచింది. అనంతరం తహశీల్దార్ కృష్ణజ్యోతి రైతులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు గోనె సంచులు, లారీలు పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్‌టిసి బస్సు బోల్తా

ప్రయాణికులు సురక్షితం | పలువురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

ఆర్‌టిసి బస్సు బోల్తాపడిన ఘటన మండలంలోని ఇంగిలంపాకలంక వద్ద శనివారం రాత్రి జరిగింది. ప్రయాణికులందరూ స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సాయంత్రం గుడివాడ నుండి నందిగామలంక చేరుకుంది. తిరిగి 38 మంది ప్రయాణికులతో నందిగామలంక నుండి గుడివాడ బయలుదేరింది. 7:25 గంటల సమయంలో ఇంగిలింపాకలంక చేరుకుంది. అక్కడ నుండి రహదారి అధ్వానంగా ఉండటంతో అదుపుతప్పి పక్కనే ఉన్న బోదెలో బోల్తా పడింది. ఈ ఘటనతో ప్రయాణికులతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణ భయంతో రక్షించండి అంటూ ఆర్తనాదాలు చేశారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారికి ఆర్‌ఎంపి వైద్యులతో వైద్యం చేయించి ఇతర వాహనాల్లో స్వగ్రామాలకు పంపారు. కైకలూరు సిఐ వైవిఎల్.నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

కదులుతున్న నేతలు పీఠాలు



సాధారణ ఎన్నికల వేడి నేతల్లో మొదలైంది. ఆయా పార్టీల అధినేతల హడావుడితో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అధికార, ప్రతిపక్ష నేతలు అటు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించడంతోపాటు ఇటు ప్రజాక్షేత్రంలోకి కదులుతున్నారు. సేవా కార్యక్రమాల పేరిట ఇప్పటి నుంచే ఇబ్బంది లేకుండా అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సిట్టింగులు, మరికొందరు ఇన్‌ఛార్జులు తమ పీఠాలు కదలకుండా జాగ్రత్త పడుతున్నారు. మొత్తంగా సాధారణ ఎన్నికలకు ఇంకా 15 నెలల వరకూ సమయం ఉన్నా నేతలకు ఎన్నికల ఫీవర్ ప్రారంభమైందని చెప్పొచ్చు.

సిఎం జగన్ గత నెలలో పశ్చిమలోని నరసాపురం వచ్చి వెళ్లారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు దెందులూరు, చింతలపూడి, పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పర్యటించారు. దీంతో జిల్లాలోని అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతల్లో ఒక్కసారిగా సాధారణ ఎన్నికల వేడి రగులుకుంది.

ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ తీరు ఆధారంగానే టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని సిఎం జగన్ ప్రకటించడంతో వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎలతోపాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల్లోనూ కలవరం మొదలైంది. అదే సమయంలో జంపింగ్ జిలానీలపైనా విస్తృత చర్చ సాగుతోంది. ప్రధానంగా గ్రూపు విబేధాలు తారాస్థాయికి చేరుకున్న నియోజకవర్గాల్లో సిట్టింగుల్లోనూ ఒకింత ఆందోళన నెలకొంది. ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ, ఎంపీలు రెండు గ్రూపులుగా విడిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రతి అంశంలోనూ విపక్షం కన్నా స్వపక్షంలోనే విమర్శ ప్రతివిమర్శలకు దిగుతున్న పరిస్థితి ఈ నియోజకవర్గ అధికారపక్షంలో నెలకొంది. దీంతో గతంలో అధికారపక్షమైన టిడిపి ఇక్కడ ఎదుర్కొన్న పరిస్థితే ప్రస్తుత అధికారపక్షమైన వైసిపిలో నెలకొందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో ఇక్కడ టిడిపి ఎంఎల్ఏగా గెలుపొందిన పీతల సుజాత మంత్రి పదవి దక్కించుకున్నా మధ్యలోనే ఆ పదవి కోల్పోవడంతోపాటు గత ఎన్నికల్లో టిక్కెట్ కూడా దక్కించుకోలేకపోయారు. అదే చరిత్ర వైసిపిలోనూ రానున్న ఎన్నికల్లో పునరావృతమవుతుందా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ఇక ఏలూరు నియోజకవర్గంలో నగరపాలక సంస్థ వ్యవహారం అక్కడ మాజీ డిప్యూటీ సిఎం, ఎంఎల్ఎ ఆళ్ల నానికి తలనొప్పులు తెచ్చిపెడుతుందని చెప్పొచ్చు. కమిషనర్ వ్యవహారం, కార్పొరేటర్లే విపక్షంగా మారడం, గతంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ అవినీతి వ్యవహారం పంటి కింద రాయిలా మారాయని చెప్పొచ్చు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రస్తుతం ఆ నియోజకవర్గంపైనే ప్రధానంగా దృష్టిసారించి ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతానికి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు పైకి కన్పిస్తున్నా ఎన్నికల సమయానికి ఇక్కడ పోటీదారులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని పరిశీలకుల అంచనా. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రస్తుతానికి సిట్టింగులకు అంతగా ఇబ్బంది లేనట్లు ఒక అంచనా. అదే సమయంలో ప్రతిపక్ష టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లులో నిమ్మల రామానాయుడు ఎలాంటి ఇబ్బందీ లేకుండా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ప్రతి అంశాలోనూ జోక్యం చేసుకుంటూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ముందుంటున్నారు.

ఉండి నియోజకవర్గానికి వచ్చేసరికి పరిస్థితి వేరేలా ఉంది. ఇక్కడ అధికారపక్షం వైసిపి తరహాలోనే టిడిపి కూడా అంతర్గత విబేధాలతో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా మాజీ ఎంఎల్ఏ వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించడంతోపాటు ఇక నుంచి తాను సేవా కార్యక్రమాలు పెంచడంతోపాటు పార్టీలోనూ క్రియాశీలకంగా ఉంటానని ప్రకటించడం దేనికి సంకేతమో అని అంతా మల్లగుల్లాలుపడుతున్నారు. శివకు వరుసకు సోదరుడైన మంతెన రామరాజు ప్రస్తుతం ఉండి ఎంఎల్ఏగా ఉన్నారు. మరి ఈసారి శివకు ఉండి టిక్కెట్ కోరుకుంటారా అనే చర్చ మొదలైంది. అదే సమయంలో ఆయన భీమవరం టిక్కెట్ కోరుకుంటున్నట్లు ప్రచారమూ ఉంది. ఒకవేళ ఎంఎల్ఏ టిక్కెట్ ఇవ్వకపోతే శివ వైసిపి వైపు చూసే అవకాశం ఉందని, ఇప్పటికే వైసిపి అధిష్టానం కూడా ఆ ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఆ నియోజకవర్గ పరిధిలోని గ్రామానికి చెందిన మాజీ మంత్రి తన కుమారునికి ఈ సీటు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఇరుపక్షాల్లోనూ టిక్కెట్ కోసం పోటీ పెరగ్గా శివ మళ్లీ క్రియాశీలకంగా తెరపైకి రావడం హాట్ టాపిక్‌గా మారింది.

ఏదేమైనా సాధారణ ఎన్నికలకు సుమారు సంవత్సరం ముందే ఆశావహులకు ఎన్నికల జ్వరం సోకిందని ఈ పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. అయితే ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో వేచిచూడాలి.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

న్యాయ సేవాధికార సంస్థ పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అన్ని కోర్టుల్లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి ఉమామనుసుంద తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో లేబర్, మనీసూట్, గృహహింస, చెక్‌బౌన్స్ కేసులు అలాగే సివిల్‌కు సంబంధించిన బ్యాంకు రుణాలు, వాహన సంబంధ కేసులు, రెవెన్యూ, విద్యుత్, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు మొదలైనవి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గతనెల 12వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 9,552 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 224, వాహన ప్రమాద కేసులు 167, వీటిలో రూ.7 కోట్ల 22 లక్షలు పరిహారంగా చెల్లించామని తెలిపారు. 8837 క్రిమినల్ కేసులను, 327 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేశామని చెప్పారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసుల కంటే రాబోయే జాతీయ లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులు పరిష్కరించబడాలని కోరారు. ఈ కేసుల పరిష్కారంలో స్వయంగా గాని, తమ అడ్వకేట్ ద్వారా గాని పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రాజేశ్వరి, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం విద్యుత్ ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, ఉపన్యాస పోటీలను ఆర్ఆర్.పేటలోని విద్యుత్ భవనంలో నిర్వహించినట్లు ఎపిఇపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ టి.శశిధర్ తెలిపారు. ఈ పోటీలలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు డిసెంబర్ 20న ఏలూరు విద్యుత్‌భవన్‌లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాద్రిగూడెంలో హౌసింగ్ డే

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రభుత్వం నిజం చేస్తుందని చింతలపూడి ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నిరజాసుధాకర్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిగూడెంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మణికుమారి, తహశీల్దార్ కృష్ణజ్యోతి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను తక్షణమే చెల్లించాలని టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. కొయ్యలగూడెంలో ఆమె నివాసం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను తక్షణమే చెల్లించాలని, లేకపోతే ఉద్యోగుల తరఫున ఆందోళన చేపడతానని తెలిపారు. నెలలో సగం రోజులు గడిచినా ఇప్పటికీ జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందంటే ఇంకా సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలు చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేవలం జీతాల మీద ఆధారపడి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఇఎంఐలు, కిరాణా సరుకులు, పాలు, కూరగాయలు వంటివి తెచ్చుకున్నచోట నెల గడిచిపోయినా కట్టేందుకు డబ్బులు లేక ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమ్య, లక్ష్మి, ఆకుల విజయ పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - గణపవరం

హెచ్ఐవి ఎయిడ్స్‌తో బాధపడుతున్న చిన్నారులకు నూతన సంవత్సరం సందర్భంగా హోప్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, పోషకాహారం అందించారు. గణపవరం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఓదార్పు అవసరమన్నారు. భయం ఆందోళన చెందకుండా బాగా చదువుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రభుత్వ పథకాలు తెలుసుకోవాలని చెప్పారు. హోప్ సంస్థ గత 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. గణపవరం, నిడమర్రు, పెంటపాడు, కాళ్ల, ఉండి, ఆకివీడు, తాడేపల్లిగూడెం, భీమవరం మండలాలకు చెందిన చిన్నారులకు నూతన వస్త్రాలు పోషకాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.శేషు, ఎపిఎం సిహెచ్.రాజేష్, ట్రస్టు వ్యవస్థాపకులు, న్యాయవాది సంధి ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

జగనన్న గ్రీన్ విలేజ్‌లో అన్ని వసతులు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

నియోజకవర్గ చరిత్రలోనే వైఎస్ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్ నిర్మాణం ఒక సువర్ణ అధ్యాయమని, అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇళ్ల లబ్ధిదారులు, వాలంటీర్లు, సంబంధిత శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. గతంలో తాను సర్పంచిగా ఉన్న కాలంలో వైఎస్ఆర్ కాలనీలో పట్టాలిచ్చి 365 ఇళ్లు నిర్మించామని తెలిపారు. మళ్లీ ఇప్పుడు ఎంఎల్ఎగా వంద ఎకరాల లే అవుట్ చేసి 2,989 మందికి పట్టాలిచ్చి ఇళ్ళు మంజూరు చేశామన్నారు. కాలనీ వాసులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని మతాలను గౌరవిస్తూ చర్చికి, మసీదుకు, శ్రీకృష్ణ మందిరాలకు పది సెంట్ల చొప్పున స్థలం కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కృష్ణమోహన్, సర్పంచి నవరత్నకుమారి, వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, తాహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని గుళ్లపూడి గ్రామంలో రూ.పది లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. మండలంలోని మారుమూల అటవీ గ్రామాలు (దొరమామిడి గ్రామ పంచాయితీ) దొరమామిడి-2 సచివాలయ పరిధిలో వీరమద్దిగూడెం, గుళ్లపూడి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుళ్లపూడి గ్రామంలో రూ.పది లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులపై సమీక్ష

భీమడోలు: నాడు నేడు కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన వివిధ అంశాలకు కేటాయించిన మొత్తాలను ఈ నెలాఖరులోగా ఖర్చు చేసి ప్రగతి వివరాలు సమర్పించాలని ఎంపిడిఒ రాఘవన్, పంచాయతీరాజ్ భీమడోలు ఎఇఇ డి.సత్యనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నాడు-నేడు పనుల ప్రగతిపై పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాఘవన్ మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వంటశాలల వద్ద, మరుగుదొడ్ల వద్ద శుభ్రతా కార్యక్రమాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్ణీత కాలంలో వినియోగానికి ప్రత్యేకించిన రంగులతో కూడిన కోడిగుడ్లను ఆయా సమయాల్లో పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు అందించాలని సూచించారు.

కేన్సర్ అవగాహన అవసరం

ఏలూరు అర్బన్: కేన్సర్‌పై ప్రతిఒక్కరిలోనూ అవగాహన అవసరమని దెందులూరు మండలం గోపన్నపాలెం సర్పంచి కోట నాగమల్లేశ్వరికుమార్ అన్నారు. గోపన్నపాలెం సర్పంచి, వంగాయగూడెం గుడ్ సమరిటన్ కేన్సర్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్య శిబిరం ఏలూరులో నిర్వహించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చైతన్యానికి ప్రతిరూపం అల్లూరు మూర్తిరాజు

నేడు ప్రథమ సంస్మరణ



అల్లూరు మూర్తిరాజు జీవితం అందరికీ ఆదర్శం. ఆయన స్వస్థలం ప్రస్తుత కోనసీమ అంబేద్కర్ జిల్లాలోని సఖినేటిపల్లి. ఆయన తండ్రి అల్లూరు రామరాజు. అయితే ఆయనను అందరూ అప్పనరాజే రామరాజు అంటారు. మూర్తిరాజు పెద్దతమ్ముడు ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ నాయకులు అల్లూరు సత్యనారాయణరాజు. మూర్తిరాజుకు ఇద్దరు సోదరీమణులు, నలుగురు సోదరులు. పెద్ద కొడుకైన మూర్తిరాజు చిన్నవయసులోనే తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటూ చదువుకున్నారు. అల్లూరు సత్యనారాయణ కమ్యూనిస్టు నేతగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తూ ఆర్థికంగానూ ఎంతో తోడ్పాటునందించారు. మూర్తిరాజుకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇటు తల్లిదండ్రులు, సోదరులు నలుగురు, ఒక సోదరి చనిపోయినా తమ్ముళ్ల పిల్లలందరికీ పెద్ద దిక్కుగా నిలిచి అండగా ఆదుకున్నారు. మూర్తిరాజుకు మూఢనమ్మకాలు లేవు. పూజలు చేసేవారు కాదు. ఎప్పుడూ మెడిటేషన్ చేసేవారు. జేబులో ఒక రూపాయి కూడా ఉంచుకునేవారు కాదు. నిస్వార్థ త్యాగధనుడు మూర్తిరాజు. తమ్ముడు అల్లూరు సత్యనారాయణ పార్టీ బాధ్యతలతో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 30 సంవత్సరాలు నివసించిన కాలంలో మూర్తిరాజు సఖినేటిపల్లి నుంచి ప్రతినెలా వచ్చి తమ్ముడు ఆర్థిక విషయాలు వగైరా, అవసరాలు తెలుసుకుని బియ్యం, వంట సరుకులు పాలకొల్లు చేర్చేవారు. ఆ తండ్రీకొడుకుల ఆదరణతోనే అల్లూరు సత్యనారాయణ ఏ ఇబ్బందులూ లేకుండా బాధ్యతల రీత్యా 1994లో హైదరాబాద్ రాగలిగారు. ఆ అన్నదమ్ముల అనుబంధం ఎనలేనిది. అల్లూరు సత్యనారాయణ 2014 జులై నాలుగో తేదీన కన్నుమూసిన సమయంలో మూర్తిరాజు మౌనంగా కుర్చుండిపోయారు. చివరకు 96 సంవత్సరాల వయస్సులో మూర్తిరాజు 2021 డిసెంబర్ 18న కన్నుమూశారు. తండ్రికి వారసులుగా వారి బిడ్డలు ధన్యులు. నిరంతరం వారి స్మృతులతో..

-అల్లూరు మన్మోహిని

అంత్యక్రియలకు ఫీజు వసూలు సిగ్గుచేటు

కలెక్టర్‌కు, జెసికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు శ్మశానవాటికలో మృతదేహాల అంత్యక్రియలకు రూ.ఐదు వేల ఫీజు వసూలు చేయాలని నగరపాలక సంస్థ తీర్మానించడం సిగ్గుచేటని, ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు, జిల్లా జాయింట్ కలెక్టర్, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్ పి.అరుణ్‌బాబుకు సిపిఎం నగర కమిటీ తరపున శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ కాటికాపర్లకు నగరపాలక సంస్థ, ప్రభుత్వం వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అంత్యక్రియలు ఉచితంగానే చేయాలన్నారు. శ్మశాన వాటికల నిర్వహణ, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయటం అనేది స్థానిక సంస్థల చట్టపరమైన బాధ్యత అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ తన బాధ్యతను విస్మరించి అంత్యక్రియలకు ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు చూస్తుంటే రోజురోజుకి పట్టణ సంస్కరణల పేరుతో ప్రతి పౌర సదుపాయానికి యూజర్ ఛార్జీలను వసూలు చేసే విధానాలను ప్రవేశపెట్టాయన్నారు. ఆస్తిపన్ను, ఏనాడు లేని రీతిలో చెత్త పన్ను కూడా బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. పైగా ప్రస్తుతం మంచినీటి కుళాయిలకు నీటి మీటర్లు బిగించే ఆలోచన, మరుగుదొడ్లు లెక్కించి భూగర్భ డ్రెయినేజీకి ఫీజులు వసూలు చేయాలని ఆలోచన ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కాటికాపర్లకు వేతనాలను నగరపాలక సంస్థ చెల్లించాలే తప్ప ఆ భారాన్ని మృతుల కుటుంబాలపై వేయకూడదన్నారు. తక్షణమే ఏలూరు నగరపాలక సంస్థ చేసిన ఈ తీర్మానాన్ని రద్దు చేసి, శ్మశాన వాటికలో పని చేస్తున్న కాటి కాపర్లుకు వేతనాలు మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య, నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ఏలూరు

అసైన్డ్, సీలింగ్, గయళ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ శాఖ అధికారి కిషోర్‌బాబుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేదలు, దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా జిల్లాలో రెవెన్యూ శాఖ అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. గత 25 ఏళ్ల నుంచి దోసపాడులో స్థానికేతర భూస్వాములు దళితులు, పేదల భూములను దౌర్జన్యంగా, అక్రమంగా ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. భూస్వాములకు తొత్తులుగా మండల రెవెన్యూ శాఖ అధికారులు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. పేదలకు అన్యాయం చేయడమే కాకుండా, పేదల కుటుంబాలను రోడ్డున పడవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులే పక్కదారి పడుతున్నారని విమర్శించారు. సుమారు 350 ఎకరాల పేదల భూములను స్థానికేతర భూస్వాములు చేతుల్లో గత పాతికేళ్లుగా ఉన్న వాటిపై విచారణ జరపాలని రెవెన్యూ శాఖ అధికారులకు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పేదలు మొర పట్టించుకోకుండా సమస్యను దాటవేస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కరించాలని కోరారు. భూములేని కుటుంబాలకు భూ పంపిణీ చేసి జీవనోపాధికి తోడ్పడాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆర్‌డిఒ స్పందించి సమస్యను జెసి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటికే దీనిపై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రికార్డులు చూస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, నాగేంద్ర, సామేలు, సుబ్బలక్ష్మి, లలిత పాల్గొన్నారు.



కిషోర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణ

ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని విరమించుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండలంలోని మధ్యబ్రింకలపాడు గ్రామంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం తెల్లం దుర్గారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీతారాం మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగారం నిర్మాణానికి, వంకావారి గూడెం, తాటియాకులగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో సుమారు 2300 ఎకరాల భూమిని ఆయుధాల తయారీ, డంపింగ్ యార్డ్ కోసం సేకరించేందుకు సిద్ధం చేస్తుండటం దారుణమన్నారు. ఇప్పటికే మండలంలో పోల వరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కోసం భూమ ఎలను కేటాయించారని, వారికి ఇప్పటికీ కూడా న్యాయం చేయలేదని చెప్పారు. ప్రయివేట్ (కంపెనీ) వ్యక్తులు చేపట్టబోయే ఆయుధ కర్మాగారాన్ని విరమించుకోవాలని, లేకపోతే ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో ఉద్యమం నిర్వహిస్తా మని ఆయన హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎలో అధికారులు లేక నిర్వీర్యమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి నాలుగు నెలలుగా లేరని ఇన్‌ఛార్జి పిఒగా జాయింట్ కలెక్టర్‌ను నియమించారని తెలిపారు. గిరిజన సంక్షేమం చూడాల్సిన ప్రాజెక్ట్ అధికారి విద్యారంగాన్ని చూడాల్సిన గిరిజన ఉపసంచాలకులు(డిడి) గిరిజన భూ వివాదాలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉప కలెక్టర్(ఎస్‌డిసి) లేకపోవడం గిరిజన అభివృద్ధికి తీరని ఆటంకం కలుగుతుందన్నారు. తక్షణమే ఆ పోస్టులను భర్తీ చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కారం భాస్కర్, చోడెం దుర్గ, కారం సూర్యచంద్రరావు, కొవ్వాసి దుర్గారావు, గుజ్జు నాగేంద్ర, కె.దావీదు, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

రోడ్డు నిబంధనలు పాటించాలని ర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ రోడ్డు నియమ, నిబంధనలు పాటించాలని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని, ట్రాఫిక్‌కు సంబంధించిన నినాదాలిస్తూ హెల్మెట్ ధరించిన, సీటు బెల్టు పెట్టుకున్న వాహన చోదకులకు ఒక పుష్పం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, పాఠశాల ఆర్ఐ పార్థసారథి, కో ఆర్డినేటర్ ఉదయ్ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఎఒ రవీంద్ర, డీన్ మధుబాబు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - గణపవరం

వినియోగదారుల హక్కుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అన్నారు శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో జిల్లా కామర్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల హక్కులపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో బంగారయ్య మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో మోసపోయే అవకాశం నష్టం కలగకుండా ఉండాలంటే కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్త వహించాలన్నారు. హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటే కొనుగోలు చేసే వస్తువులపై మోసపోయే అవకాశం ఉండదన్నారు.

నిర్మలకుమారి మాట్లాడుతూ బంగారయ్య వినియోగదారుల హక్కుల సంఘం ద్వారా చేసిన కృషికి 123 అవార్డులు అందుకున్నారని చెప్పారు. తమ కాలేజీలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బంగారయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ పి.మధురాజు, అధ్యాపకులు టి.అక్కరాజు, రాణి, దుర్గ, వెంకన్నబాబు, పివి.రమేష్, రాజు, విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేసేందుకు విజ్ఞాన సదస్సులు

చింతలపూడి: భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు, విధులు కల్పించిందని, వాటికి భంగం కలిగిస్తే చర్యలుంటాయని జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్ అన్నారు. మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక జామియా మసీదులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలవరం గట్టు తవ్వకంపై దాడి

ఉంగుటూరు: గొల్లగూడెంలోని పోలవరం కాలువగట్టు కంకర గుట్లను అక్రమంగా తవ్వడంపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దాసరి ఫణి, మలకలపల్లి నాగు తదితరులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విఆర్ఒ చంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని జెసిబిని సీజ్ చేవారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వాలంటీర్లు : ఎంపిపి

ముదినేపల్లి: అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధులు గ్రామ వాలంటీర్లు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం మండలంలోని అన్ని గ్రామాల వాలంటీర్లకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమం, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ అందించాలన్నారు.

రోడ్డు ప్రమాద బాధితునికి సాయం

ముదినేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితునికి కాపు సంఘం నాయకులు శనివారం అర్థికసాయం చేశారు. వాడవల్లికి చెందిన వై.రాము రోడ్డు ప్రమాదంలోగాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈవిషయం తెలుసుకున్న కైకలూరు నియోజకవర్గ కాపు సంఘం సభ్యులు రామును పరామర్శించి రూ.1,07,500 అర్థిక సాయంగా అందించారు.

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రాజమహేంద్రవరం వారి కోర్టులో

I.A. 8/2021, O.S. 13/2021

Between:
వల్లెం శ్రీ తనూజ
నాగదుర్గా సుధీర్
రాజమహేంద్రవరం
తూర్పుగోదావరి జిల్లా -పిటీషనర్/వాది
AND
హరి లలిత రత్నకుమారి, W/o. విశ్వేశ్వర శాస్త్రి, డో.నెం. 8-167, రేలంగి గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
-రెస్పాండెంట్/ప్రతివాది

ప్రకటన

పై తెలిపిన పిటీషనర్ ప్రోనోటు బాకీ నిమిత్తం పై కోర్టులో దాఖలు చేసిన దావాలో మీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ జప్తు చేయమని పిటిషన్ దాఖలు చేసినారు. సదరు పిటిషన్‌లో మీకు ఎన్నిసార్లు సమనులు పంపుతున్న తీసుకొనక ఉద్దేశపూర్వకంగా త్రిప్పి పంపుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు తెలియచేయునది ఏమనగా, **ది. 20-12-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల సదరు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించబడును అని తెలియచేయబడును.

బి.వి.రామణారావు
యస్.మణికంఠ
న్యాయవాదులు, రాజమహేంద్రవరం

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 53/2021
in O.S No: 14/2021

పిటీషనర్లు /వాదులు:
Manthena Appala Raju & 2 Others
రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
M/s Ramji BuildersHyderabad Partnership firm Rep. by it's Managing Partner Dantuluri Venkata Viswanadha Varma and 3 others
3వ రెస్పాండెంటు అడ్రస్సు:
Bokka Anil Prakash S/o Surya Prakash Rao aged 42 years, D.no:8-10, R/o Srungavruksham, Palakoderu Mandalam, West Godavari District.

పై నెంబరు దావాలో 3వ రెస్పాండెంటుకు కోర్ట్ ద్వారా, పోస్టు ద్వారా నోటీసులు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 3వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది.30-12-2022 సం॥తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్ట్ వారి ఎదుట స్వయముగ గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల 3వ రెస్పాండెంటు పరోక్షములో ఈ పిటీషను తీర్మానించబడును.

R. PADMANABHA RAJU
ADVOCATE, VISSAKODERU
Ph: 08816-232006, Cell:9849635172

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S No: 14/2021

వాదులు:
Manthena Appala Raju & 2 Others
ప్రతివాదులు:
M/s Ramji Builders Hyderabad Partnership firm Rep. by it's Managing Partner Dantuluri Venkata Viswanadha Varma and 3 others
3వ ప్రతివాది అడ్రస్సు:
Bokka Anil Prakash, S/o Surya Prakash Rao aged 42 years, D.no:8-10, R/o Srungavruksham, Palakoderu Mandalam, West Godavari District.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాదికి కోర్ట్ ద్వారా, పోస్టు ద్వారా దావాసమన్లు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 3వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది.30-12-2022 సం॥తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా ఉదయం 10:30 గంటలకు పై కోర్ట్ వారి ఎదుట స్వయముగ గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల 3వ ప్రతివాది పరోక్షములో ఈ దావా తీర్మాణించబడును.

R. PADMANABHA RAJU
ADVOCATE, VISSAKODERU
Ph: 08816-232006, Cell:9849635172

19న జూనియర్ కళాశాల ఆవరణలో 'స్పందన'

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 19వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు గ్రామానికి చెందిన గుల్ల తంబి, తండ్రి: గుల్ల పెద్దలు అను నేను ఉంగుటూరు నుండి నారాయణపురం ఆటోలో వెళ్ళుచుండగా మార్గ మధ్యలో **N7193704** నంబరు గల పాస్‌పోర్టు **పోయినది** దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

గుత్తికొండ శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 98480 50089

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 1233/2022
ఇన్ ఓ.ఎస్.నెం. 173/2017

బిట్వీన్:
శ్రీ ముత్యాల రాంబాబు ...వాది
మరియు
1) శ్రీమతి కేత భూవమ్మ (డైడ్)
2) శ్రీమతి పంపన్న నాగలక్ష్మి మరియు 3 వగైరాలు ...ప్రతివాదులు
5వ ప్రతివాది /ప్రపోజల్ పార్టీ:
శ్రీ కేత శ్రీను, తండ్రి: లేటు వెంకటేశులు, ఇంటి నెం.2-77, మీనవల్లూరు గ్రామం, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు ద్వారా ప్రపోజల్ పార్టీ అయిన 5వ ప్రతివాదికి శ్రీ కోర్టు ద్వారా పంపించిన సమన్లు అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం **ది.23-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను.** లేనిఎడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును. ఇందుమూలముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయడమైనది.

అద్దంకి విజయ రత్నం
వాది తరుపున అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
16-12-2022. సెల్: 92901 88928

మహారాజశ్రీ చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 218/2019

వాది: మల్లువలస మావుళ్ళు వగైరా
ప్రతివాదులు:
కోటికలపూడి గోపాల కృష్ణ కుమారి వగైరా
మొదటి ప్రతివాది:
కోటికలపూడి గోపాల కృష్ణ కుమారి, భర్త: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం- 3, ప॥గో॥జిల్లా.
రెండవ ప్రతివాది:
కోటికలపూడి సంతోషి, తండ్రి: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం-3, ప॥గో॥జిల్లా.
మూడవ ప్రతివాది:
కోటికలపూడి శ్రీరామ్, తండ్రి: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం-3, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది.23-12-2022 సం॥రం॥ తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగ గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.వి.రమేష్,
భీమవరం, వాది తరపు న్యాయవాది.
16-12-22. పెన్నాడ.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో

ఇ.పి.నెం. 40/2022
ఓ.ఎస్.నెం. 65/2018

మధ్య:
సత్తి ధనవీర వెంకటలక్ష్మి, భర్త: రామిరెడ్డి, హిందూ, స్త్రీ, వయస్సు 40 సం॥లు, గృహిణి, డో.నెం. 3-161/సి, ఆల్ఫా స్కూలు రోడ్డు, నెగ్గిపూడి, పెనుమంత్ర మండలం.
TNK SCJC ...D.H.R
VS
ముమ్మిడి ఏసు, తండ్రి: సత్యనారాయణ, హిందూ, మేల్, వయస్సు 41 సం॥లు, వ్యాపారం, డో.నెం. 2-13-87, వెంకట్రామన్నగూడెం, తాడేపల్లి గూడెం మండలం.
TPG SCJC ...J.D.R

డి.హెచ్.ఆర్. తరపు వేలము ప్రకటన కోర్టు ఉత్తర్వులు ప్రకారం

పై నెంబరు ఇ.పి.40/2022 ఇన్ ఓ.ఎస్.65/2018 పై కోర్టు వారి నందు సదరు ఇ.పి. షెడ్యూలు అనగా ఈ క్రింది స్థిరాస్తిని డి.హెచ్.ఆర్. డిక్రీ బాకీ రాబట్టుట కొరకు శ్రీ కోర్టు వారు **ది.04-01-2023 తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలము వేయుదురు.** కావున యావన్మంది సదరు వేలములో పాల్గొని షెడ్యూలు ఆస్థిని పాడుకోవాల్సిందిగా కోరుచున్నాము.

షెడ్యూలు ఆస్థి వివరం

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్, జగ్గన్నపేట గ్రామం ఆర్.ఎస్.నెం. 123/6ఎ లో సెంట్లలో ఎ.0-49 సెం॥ మరియు ఆర్.ఎస్.నెం. 123/6డి లో ఎ.0-6సెంట్లు మొత్తం ఎ.0-55 సెంట్లు ఈ క్రింది హద్దుల మధ్య:
తూర్పు: కాలువ.
దక్షిణం: రెడ్డి సత్తిరెడ్డి గారి స్థలం.
పడమర: పత్సా సోమన్న గారి భూమి.
ఉత్తరం: నీలపాల పెద్దిరాజు గార భూమి.

పై తెల్పిన హద్దుల మధ్య ఎ.0-55 సెంట్లు వ్యవసాయ భూమి యావత్తు ఈజుమెంటు హక్కులతో సహాయ్ను.

డి.హెచ్.ఆర్.విలువ : రూ.6,00,000/-
సబ్‌రిజిస్ట్రార్ విలువ : రూ.5,50,000/-

శిరిగినీడి విజయకృష్ణ
ఏపీపీ, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.